క్లుప్తంగా

వీఆర్వోలతో సమావేశం



మాట్లాడుతున్న డీటీ ప్రదీప్

ముత్తుకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, మండల వ్యవసాయాధికారి జోత్స్న రాణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకుని 11 అంకెల ఐడీని పొందాలన్నారు. ఈనెల 25వ తేదీలోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు తమ పాస్ పుస్తకాలతో సచివాలయానికి వెళ్తే ఉద్యోగుల ద్వారా ఐడీ పొందవచ్చన్నారు.

ఎంవీ పాళెంలో గ్రామసభ



మాట్లాడుతున్న డీటీ శ్రీనివాసులు

ముత్తుకూరు: మండలంలోని ముసునూరువారిపాళెం సచివాలయంలో సోమవారం గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా రీ సర్వే డీటీ శ్రీనివాసులు మాట్లాడుతూ పైనాపురం రెవెన్యూ గ్రామంలో జరిగే భూముల రీ సర్వేకి రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్వయంగా వారి అనుభవంలో ఉన్న పొలం గట్లను చూపించాలన్నారు. అడంగళ్‌లో మార్పులు, చేర్పుల వివరాలు కూడా అందజేస్తే సరిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ అనురూప్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు బంగారు సరుడు బహూకరణ

పొదలకూరు: పట్టణంలో ఉన్న గంగమ్మ తల్లి ఆలయానికి భక్తులు సోమవారం బంగారు సరుడును బహూకరించారు. మండలంలోని ఆర్‌వై పాళెం గ్రామానికి చెందిన తోపిదేవి పెంచలయ్య – రమాదేవి దంపతుల కుమారులు మూడు సవర్ల బంగారు సరుడును అమ్మవారి కోసం చేయించి ఇచ్చారు. కార్యక్రమంలో నరసింహులు, అంకయ్య, రాము, పూజారి పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆధార్ తప్పనిసరి

తోటపల్లిగూడూరు: వరిసాగు చేసే ప్రతి రైతుకు భూ ఆధార్ తప్పనిసరి అని ఇందుకూరుపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఇస్కపాళెం రైతు సేవా కేంద్రంలో సోమవారం భూ ఆధార్, ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లుడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు రైతులకు అందాలంటే భూ ఆధార్ నమోదు చేసుకోవాలన్నారు. గతంలో ఆధార్ కార్డును ఎలా పొందారో అదే విధంగా పొలం కలిగిన ప్రతి రైతు కూడా భూ ఆధార్‌తో కూడిన యూనిక్ ఐడీని తీసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన క్యాంపులకు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తదితరాలను తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి, వీఏఏలు సుమంత్, షర్మిల, విద్యాసాగర్, వినీల, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలకు 271 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్శిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన పీజీ కోర్సులు మొదటి సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షలు తదితర వాటికి 271 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 1,976 మందికి గానూ 1,797 మంది హాజరయ్యారని, 179 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 1,477 మందికి గానూ 1,385 మంది హాజరయ్యారని, 92 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అలాగే డిగ్రీ మొదటి సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షల్లో 22 మంది విద్యార్థులకు గానూ 21 మంది హాజరైనట్లు వెల్లడించారు.

విద్యుత్ లైన్ విస్తరణ



గండవరంలో జరుగుతున్న విస్తరణ పనులు

కొడవలూరు: మండలంలోని గండవరంలో ఉదయకోశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి జరుగనున్న నేపథ్యంలో రథోత్సవానికి అసౌకర్యం కలగకుండా ఆలయ రోడ్డును విస్తరించారు. అందులో భాగంగా ఏఈ ఎం.రాములు ప్రత్యేక చొరవ తీసుకుని ఆలయ రోడ్డుకున్న విద్యుత్ లైన్‌ను సోమవారం విస్తరించారు. రోడ్డుకు నాలుగు అడుగుల దూరంలో నూతన విద్యుత్ స్తంభాలను వేసి లైన్‌ను విస్తరించారు.



అంతా గోప్యం

- గుట్టుచప్పుడు కాకుండా చేపల చెరువుల బహిరంగ వేలం
- పంచాయతీల ఆదాయానికి భారీగా గండి
- అధికారులతో నేతల కుమ్మక్కు
- కూటమి ప్రభుత్వంలో ఇదీ పరిస్థితి

మనుబోలు: పంచాయతీల పరిధిలోని చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు ఏటా బహిరంగ వేలం నిర్వహిస్తారు. దీంతో పంచాయతీలకు భారీగా ఆదాయం వచ్చేది. ఈ వేలానికి గ్రామంలో దండోరా వేయడంతోపాటు మీడియాకు కూడా ముందుగానే సమాచారం ఇస్తుంటారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పలు గ్రామాల్లో పంచాయతీ అధికారులు స్థానిక అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై, ఈ ప్రక్రియను గోప్యంగా నిర్వహిస్తున్నారని విమర్శలున్నాయి. తమది పారదర్శక ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొంటున్న కూటమి నేతలు తీరును చూసి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడంటే..

వడ్లపూడి పెద్ద చెరువుకు గత ప్రభుత్వ హయాంలో చివరిసారిగా వేలం నిర్వహించినప్పుడు రూ.7.50 లక్షలు వచ్చింది. ఇటీవల అదే చెరువుకు వేలం నిర్వహించగా కేవలం రూ.2.25 లక్షలు మాత్రమే పలికినట్లు పంచాయతీ కార్యదర్శి వెల్లడిస్తున్నారు. కానీ గ్రామస్తులు మాత్రం రూ.4.50 లక్షలు పలికితే రూ.2.25 లక్షలు మాత్రమే చూపించి మిగిలిన మొత్తాన్ని గోల్‌మాల్ చేసినట్లుగా ఆరోపిస్తున్నారు. అలాగే కాగితాలపూరు పరిధిలోని నాలుగు చెరువులకు ఇటీవల వేలం నిర్వహించగా కేవలం రూ.3.25 లక్షలు పలికింది. గతంలో ఇవే చెరువులకు రెట్టింపు ధర వచ్చింది. అలాగే కొలనకుదురు గ్రామంలో గత నవంబర్‌లో వాగులు, కొలనులకు అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వేలం నిర్వహించుకున్న విషయం తెలిసిందే. అదే గ్రామానికి గత ప్రభుత్వ హయాంలో చెరువు చేపల వేలం ద్వారా రూ.5 లక్షల ఆదాయం రాగా ఈసారి వేలం ప్రస్తావనే లేదు. కొన్ని పంచాయతీల్లో అసలు వేలం నిర్వహించకుండా చేస్తుండగా మరికొన్ని చోట్ల అధికార పార్టీ అనుయాయుల ఆధ్వర్యంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారు. దీంతో పంచాయతీలు ఆదాయం కోల్పోతున్నాయి.



పంచాయతీ కార్యాలయం

సమాచారం ఇవ్వలేదు



చెరువుల చేపల వేలం అంతా గోల్‌మాల్ వ్యవహారంగా కనిపిస్తోంది. గతంలో రూ.7.50 లక్షలకు పైగా ధర పలికినప్పుడు ఇప్పుడు మూడోవంతు కూడా ఎందుకు పలకలేదు. గతంలో నేను కూడా వేలంలో పాల్గొని చివరి వరకూ పాడాను. అలాంటి నాకు ఈసారి సమాచారం ఇవ్వలేదు. అసలు వేలం నిర్వహించారో.. లేదో.. కూడా తెలియని పరిస్థితి. అంతా టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతోంది.

– వెంకటేశ్వర్లురెడ్డి, గొట్లపాళెం, వడ్లపూడి పంచాయతీ

మూడుసార్లు వేలం నిర్వహించాం

చెరువులో చేపల హక్కుల కోసం గతేడాది సెప్టెంబర్ నుంచి మూడుసార్లు వేలం నిర్వహించాం. ఓ పత్రికలో ప్రకటన కూడా ఇచ్చాం. అయితే ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర రూ.3.50 లక్షలకు పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. చివరిగా గత నెలలో నిర్వహించిన వేలంలో రూ.2.25 లక్షలు మాత్రమే పలికింది.

– అంకబాబు, పంచాయతీ కార్యదర్శి, వడ్లపూడి

రైతులకు అండగా ఉంటాం

- పోర్టు సీఈఓ జగదీష్ పటేల్



ఈ–ఆటో పంపిణీ చేసిన సీఈఓ తదతరులు

ముత్తుకూరు: అదానీ ఫౌండేషన్ తరఫున రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ అన్నారు. కేఏఫ్ పీసీఎల్ ద్వారా సోమవారం పోర్టు ప్రభావిత గ్రామాల రైతులకు కృష్ణపట్నంలో ట్రాక్టర్లు, ఈ–ఆటోలు, మోటార్లు, పురుగు మందులు, స్ప్రేయర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు పంటల ఉత్పత్తులు పెంచుకోవాలని సూచించారు. రైతు కుటుంబాల ఆదాయ వనరులను పెంచాలన్నదే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో సీఎస్సార్ హెడ్ మృత్యుంజయ రామ్, హెచ్ఆర్ అండ్ అడ్మిన్ హెడ్ అనురాగ్ ద్వివేది, సెక్యూరిటీ మేనేజర్ వెంకటేష్ భాస్కర్, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సరళ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటం చేస్తాం



పోస్టర్‌ను ఆవిష్కరించిన సంఘం బాధ్యులు

- పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాలాజీ

పొదలకూరు: పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామని అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీన పొదలకూరు మండల కార్యవర్గ ఎన్నిక నిర్వహించేందుకు పద్మశాలీలతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘాన్ని మండల స్థాయిలో ఏర్పాటు చేయడం వల్ల సమస్యలను పరిష్కరించేందుకు వీలుకలుగుతుందన్నారు. ఆదివారం ఎన్నికను నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే సమావేశంలో అందరి అభిప్రాయాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోమ గోపాల్, మాదా రాధాకృష్ణయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, చొప్పా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.49 లక్షల రాబడి



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని కామాక్షి తాయి ఆలయ అతిథిగృహంలో సోమవారం వివిధ పనులకు సంబంధించి వేలంపాటల ద్వారా రూ.49 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి సంబంధించి కొబ్బరిచిప్పల సేకరణతోపాటు అమ్మవారికి సమర్పించిన వస్త్రాల సేకరణ హక్కుకు రూ.49 లక్షలు వచ్చిందని తెలియజేశారు. తలనీలాల సేకరణ, చాపలు, పీటల అద్దె, తదితర హక్కులకు పాటదారులు పాల్గొనకపోవడంతో వాయిదా వేశామన్నారు.

మైనింగ్ అధికారుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



జమ్మిపాళెంలో మైనింగ్ అధికారుల పర్యటన

కోవూరు : మండలంలోని పోతిరెడ్డిపాళెం, జమ్మిపాళెం తదితర ప్రాంతల్లో మైగింగ్ శాఖ అధికారులు సోమవారం పర్యటించారు. ప్రాణాలను హరిస్తున్న గుంతలు అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మైనింగ్ అధికారి స్వాతి స్పందిస్తూ ఆయా గ్రామాలను సందర్శించారు. ఈ క్రమంలో పోతిరెడ్డిపాళెం ప్రాంతంలో ఒక బోట్ ఉండటాన్ని గుర్తించారు. అదేలా జమ్మిపాళెం ఇసుక రీచ్‌లోకి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట వీఆర్వో హరి పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని శిరిడీ సాయి మందిరంలో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం కుంభాభిషేకం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు బాబాను దర్శించుకున్నారు. ఉదయం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం నుంచి 108 మంది మహిళలు కలశాలను మందిరానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మందిర శిఖరంపై కుంభాభిషేకం గావించారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రి పల్లకిసేవ నిర్వహించారు.

అన్నదాతలకు అవగాహన

కోవూరు: మండలంలోని వేగూరులో ఫార్మర్ రిజిస్ట్రీపై రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సుజా త రైతులకు పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో వరిపంటను పరిశీలించి తగిన జాగ్రత్తలు వివరించారు. ఆమె వెంట ఏఓ ఇందిరావతి పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో డీ వార్మింగ్ డే

మనుబోలు: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని విద్యాసంస్థల్లో సోమవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ రాజయ్య మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు వారు మండలంలో 6,137 మంది ఉన్నట్లు తెలిపారు. మొదటిరోజు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ గేయ పూజిత, డాక్టర్ మొహిసినా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

- పొదలకూరు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. నెల్లూరు రూరల్ డివిజన్ ప్రోగ్రాం అండ్ జిల్లా ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్ దయాకర్ వరదాపురం గ్రామంలో పర్యటించి ఓ ప్రైవేట్ పాఠశాల్లో మాత్రలు పంపిణీ చేశారు. ఎమ్మార్వో కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలల పిల్లలకు వైద్యారోగ్య శాఖ సిబ్బంది మాత్రలు వేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహులు, ఆరోగ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

- కొడవలూరు: నులి పురుగుల నివారణతో పిల్లల్లో ఆరోగ్యకర ఎదుగుదల ఉంటుందని యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కావ్య సూచించారు. మండలంలోని యల్లాయపాళెం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆమె సోమవారం నులి పురుగుల నివారణ మాత్రలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల్లో వయస్సుకు తగ్గ ఎదుగుదల ఉండాలంటే నులి పురుగుల నివారణ మాత్రలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ కోటేష్, పంచాయతీ కార్యదర్శి మాల్యాద్రి, ఏఎన్ఎం మహేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పొదలకూరు మండలంలో..

నార్తురాజుపాళెంలో..

స్థానిక 2, 3 అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ నులి పురుగుల నివారణ మాత్రలు వేసి బాలసంజీవని కిట్లు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు దీనమ్మ, సలోమి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మనుబోలులో..



కొడవలూరు: యల్లాయపాళెంలో మాత్రలు వేస్తున్న వైద్యాధికారిణి కావ్య

- ఇందుకూరుపేట : మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. మైపాడు, జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఆయా పాఠశాలల్లో మాత్రలు అందించారు.



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..

ధాన్యం ధరలు తగ్గించి దగా చేయొద్దు

తోటపల్లిగూడూరు: ధాన్యం ధరలు తగ్గించి రైతులను దగా చేయడం అన్యాయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య పేర్కొన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం ధరలు తగ్గిపోతున్నాయని ఆ సంఘం నేతలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో ధాన్యం ధరలు తగ్గిపోవడంతో రైతులు బాధ పడుతున్నారన్నారు. వరిసాగులో నానాటికీ పెరుగుతున్న ఖర్చులతో ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు చెప్పారు. పుట్టికి రూ.20 వేలు అందితేనే అన్నదాతలకు మేలు జరుగుతుందన్నారు. గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇదే సీజన్‌లో పుట్టి రూ.21 వేలపైనే పలికిందని గుర్తుచేశారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యానికి గిట్టుబాటు ధరను అందించాలన్నారు. అలాగే రైతులను ముంచుతున్న మిల్లర్లు, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చర్యలు తీసుకోకపోతే ఈనెల 22వ తేదీన అన్ని రైతు సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం నేతలు, సీపీఎం నేతలు మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈపూరు లక్ష్మయ్య, మారుబోయిన రాజా, బండి శౌరి, మోచర్ల రాధయ్య, ఉండ్రాళ్ల శీనయ్య, గోపీ, శివ, ప్రభావతమ్మ, చిన్నబ్బాయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

- మనుబోలు: ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని ఇటీవల అధికారులు తెలిపారన్నారు. అయితే వరి కోతలు సమీపిస్తున్నా ఎక్కడా కొనుగోలు కేంద్రాల జాడలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దేవదానం, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

- బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. రైతులకు ప్రకటించిన మద్దతు ధర తప్పక అమలు జరగాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు అధికారులకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు, నాయకులు గండవరపు శ్రీనివాసులు, మల్లికార్జున, మునిస్వామి, అంకయ్య, రమణయ్య, సురేష్, కోటయ్య, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.
- కోవూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం నేతలు సోమవారం ఆందోళన చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ముళి వెంగయ్య, గండవరపు బుజ్జయ్య, అఫ్రోజ్, బాబు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, సర్దార్, రమణయ్య, చాన్‌బాషా, హరి, గోవర్ధన్, కాలేషా, విజయకుమార్ పాల్గొన్నారు.



టీపీగూడూరు: నిరసన తెలుపుతున్న రైతు సంఘం నేతలు, సీపీఎం నాయకులు

- కొడవలూరు: ధాన్యానికి మద్దతు ధర పుట్టికి రూ.19,720 అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ నేతలు డిమాండ్ చేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధర కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తేమ శాతం పేరుతో తగ్గించి కొనుగోలు చేయడం తగదన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సంఘ నేతలు గోనె దయాకర్, టి.నరసింహ, వి.దేవానంద్, జె.వెంకమరాజు, పి.దేవకుమారి పాల్గొన్నారు.



కొడవలూరు : తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

వైభవంగా అభయ గణపతిస్వామి విగ్రహ ప్రతిష్ట



శాంతి కల్యాణం

మనుబోలు: మండలంలోని కాగితాలపూరు గ్రామంలో అభయ గణపతి స్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు సాయికుమార్ శర్మ ఉదయం వివిధ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం యంత్ర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, మహాపూర్ణాహుతి, కుంభాబిషేకం తదితరాలు జరిగాయి. 25 అడుగుల ఎత్తైన ఏక శిలా ధ్వజస్తంభం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

కామధేను పురస్కారాల ప్రదానం



మాట్లాడుతున్న మహేష్‌స్వామి

ఇందుకూరుపేట: టీటీడీ మాజీ ఈఓ కేవీ రమణాచారి పుట్టినరోజును పురస్కరించుకుని మండలంలోని కొత్తూరు లలితా మహేశ్వరి ఆశ్రమంలో సోమవారం వేదపండితులు, అర్చకులకు కామధేను పురస్కారాలను అందజేశారు. బహుముఖ కళాకారుడు మైపాడు రాజా ఆధ్వర్యంలో ఆశ్రమ పీఠాధిపతి రామాయణం మహేష్ స్వామి పర్యవేక్షణలో అత్యంత వైభవంగా పురస్కారాల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా మహేష్ స్వామి మాట్లాడుతూ మన సంస్కృతి చాలా గొప్పదని, అందరూ ధార్మికంగా నడుచుకోవాలని కోరారు. వివిధ ప్రాంతాల నుంచి పండితుల ఇక్కడికి చేరుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం పలువురు పండితులు ఉపన్యసించారు. పురస్కారం అందుకున్న వారిలో గన్నవరపు శ్యాంసుందరమూర్తి(వేదపాఠశాల ప్రిన్సిపల్, కాకపర్రు, తూర్పుగోదావరి జిల్లా), ముదివర్తి శ్రీనివాసాచార్యులు (వేద పండితుడు, నెల్లూరు), నారాయణాచార్యులు (మల్లవరం, ప్రకాశం జిల్లా), గరుడాద్రి వెంకట దత్తాత్రేయశర్మ (ఆదోని, కర్నూలు జిల్లా), కప్పర లక్ష్మణ్‌కుమార్ శర్మ (చెంగాళమ్మ దేవస్థానం, సూళ్లూరుపేట), చీమలమర్రి వెంకట సుబ్బారావుశర్మ (కొలనుకొండ, గుంటూరు జిల్లా), గట్టుపల్లి లలిత శివకుమార్‌స్వామి (కన్యకాపరమేశ్వరి దేవస్థానం, నెల్లూరు), వెంకటాచలం కుంద్రత్తూర్ (కాంచీపురం, తమిళనాడు), రామాయణం మణిశంకరశర్మ(ఇందుకూరుపేట), సోలాకుమార్‌శర్మ (గూడూరు)లు ఉన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి వెంకట శేషాచార్యులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.